క్లుప్తంగా

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సత్తుపల్లి: గీత కార్మికులను సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. పట్టణంలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలంతో పాటు రూ.50 లక్షలను మంజూరు పత్రాన్ని గౌడ ప్రతినిధులకు అందించారు. కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఉమామహేశ్వరరావు, వాసు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, నాగేశ్వరరావు, రాఘవరావు, అప్పారావు, శ్రీను, విజయ్‌కుమార్, సందీప్, వెంకటరత్నం, కాంతారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు పంపిణీ



మొక్కను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ శుక్రవారం హరితహారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలన్నారు. అదే విధంగా 13వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు, షేక్.సైదులు, గంగారావు, రామారావు, పుష్పలత పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

తల్లాడ: గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ఉపయోగించిన ఎస్సై, పోలీసులపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ అన్నారు. తల్లాడలో శుక్రవారం నిర్వహించిన లంబాడీ హక్కుల పోరాట సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లి తండాకు చెందిన గిరిజన మహిళ లక్ష్మీబాయిపై ఎల్బీనగర్ ఎస్సై, పోలీసులు లాఠీ చార్జ్ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు నాయక్, నందా నాయక్, శంకర్‌నాయక్, తావు నాయక్, సదా నాయక్, భాస్కర్, నరసింహా పాల్గొన్నారు.

బస్‌పాస్‌లు పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మధిర ఆర్టీసీ డిపో సిబ్బంది షేక్ నాగుల్‌మీరా, చిన్నబాబు పలువురు దివ్యాంగులకు బస్ పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

సత్తుపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ జయరామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామానగరం, బేతుపల్లి పంచాయతీలలో ఆయన కలియ తిరిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే రోగాలు దరిచేరవన్నారు. అదే విధంగా గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్ ఆయా పంచాయతీలలో పర్యటించారు. మురికి గుంతలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేశారు. జ్వర పీడితులు ఎవరైనా ఉంటే పరీక్షలు చేసి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణ, సెక్రటరీలు రవితేజ, వాసు, ఆశా సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కేతవీరునిపాడు గ్రామానికి చెందిన ఇట్లూరి దాసు, చిన్న ఇరువురు కలిసి ద్విచక్ర వాహనంపై ముదిగొండలోని గంధసిరి గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో నాగులవంచ పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టారు. దాసు తలకు తీవ్ర గాయాలు కాగా చిన్నకు స్వల్ప గాయాలైనాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వేధింపుల కేసు నమోదు

కల్లూరు: ఓ మహిళ పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వెన్నవెల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ పై అదే గ్రామానికి చెందిన గుమ్మా వెంకటకృష్ణ తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆ మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై రఘు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

ముదిగొండ: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఏఐడీసంస్థ సీఎంఎంఎస్ పాపయ్య అన్నారు. మండలంలోని న్యూలక్ష్మీపురం కేజీబీవీలో ఏఐడీ సేవాసంస్థ, కైలాసత్యాది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్రం భళారే.. వి'చిత్రం'

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



చెట్టుపై ఉన్న పిచ్చుక

తల్లాడ: కవి చేతితో కావ్యం, శిల్పి చేతిలో బొమ్మలు రూపు దిద్దుకున్నట్లు ఫొటో గ్రాఫర్ చేతిలో ఉన్న కెమెరాలో అందమైన వర్ణ చిత్రాలు బందించబడతాయి. ఫొటోగ్రఫీని కొందరు సరదాగా ఎంచుకుంటారు. మరికొందరు జీవన వృత్తిగా ఎంచుకుంటారు. కొందరు అవసరానికి తగినట్లుగా ఉపయోగించుకుంటారు. ఎవరు ఏ విధంగా ఉపయోగించినా సమయానుకూలంగా స్పందించగల్గితే అద్భుతమైన ఫొటోలు తీయొచ్చు. అందమైన ప్రపంచంలో ఇదొక మరపురాని తీపిగుర్తు.

ఆనాటి చరిత్ర..

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం మూలం 1837లో ఫ్రెంచ్‌మ్యాన్ లూయిస్ డాగూరె, జోసెఫ్ నైప్సోర్ నీప్సే చే అభివృద్ధి చేయబడిన డాగ్యురోటైప్ ఆవిష్కరణ నుంచి వచ్చింది. 19, ఆగస్టు, 1939న ఫ్రెంచ్ ప్రభుత్వం డ్యాగురోటైప్ ప్రక్రియ పేటెంట్‌ను కొనుగోలు చేసి.. ఆవిష్కరణను బహుమతిగా ప్రపంచానికి ప్రకటించింది. అందుకే ప్రతీ ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుకుంటారు.

ఫొటో ప్రపంచం అందమైనది..

ఫొటో ప్రపంచం అందమైనది. ప్రకృతి చిత్రాల దగ్గర నుంచి వివిధ ఫంక్షన్లు, వివాహ శుభకార్యాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఏదైనా ఫొటోలో బంధించవచ్చు. కొన్ని ఫొటోలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయనడంలో అతియోశక్తి లేదు. ఫొటో అనేది ఎన్నటికీ చెరిగిపోని ఒక తీపి జ్ఞాపకం.

అద్భుతాలు సృష్టించవచ్చు..



కెమెరాల ద్వారా అద్భుతమైన ఫొటోలు తీయొచ్చు. మొదట ఆనందంగా తీసుకున్న ఫొటోగ్రఫీ వృత్తి జీవితానికి ఉపయోగపడే విధంగా ఎంచుకోవచ్చు. వృత్తిలో రాణిస్తే ఎన్నో వింతలు, విశేషాలను బందించవచ్చు. సమయానుకూలంగా వ్యవహరిస్తే సృష్టిలో వర్ణ చిత్రాలను రూపొందించవచ్చు. ప్రకృతి రమణీయత, ఆహ్లాదకర వాతావరణం, సమాజ స్థితిగతులను సైతం ఒక్క ఫొటో ద్వారా చూపించవచ్చు.

– గురజాల నారాయణరావు, సీనియర్ ఫొటోగ్రాఫర్, తల్లాడ

ఫొటోగ్రాఫర్లకు జాతీయ స్థాయి పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు



అవార్డు అందుకుంటున్న సతీష్‌రెడ్డి

వైరా/సత్తుపల్లిటౌన్: వైరాకు చెందిన ఫొటోగ్రాఫర్ ముత్యాల నాగేశ్వరరావు, సత్తుపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ మేకా సతీష్‌రెడ్డికి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికై శుక్రవారం విజయవాడ బాలోత్సవ్ భవనంలో అవార్డును అందుకున్నాడు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో భాగంగా 'ఫొటో గ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా'ను ఆగస్టు 15న జాతీయ స్థాయిలో నిర్వహించారు. అవార్డులు అందించిన వారిలో.. నేషనల్ మెడికల్ కమిషన్ న్యూఢిల్లీ డైరెక్టర్ జె.వి రావు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కె.హేమచంద్రారెడ్డి, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మాజీ పార్లమెంట్ సభ్యుడు గోకరాజు గంగరాజు, ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా చైర్మన్ టి.శ్రీనివాసరెడ్డి లు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

సాముహిక కుంకుమ పూజలు



వైరా: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వైరా: వైరాలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మంది మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రావణమాసం ప్రాముఖ్యతను వివరించారు. 5వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, కోఆప్షన్ సభ్యురాలు నూకల అన్నపూర్ణ, అన్నపూర్ణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో..

మధిర: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం కావటంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్‌రావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు శ్రీమాన్ శేషాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకోదండ రామాలయంలో..

సత్తుపల్లిటౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీకోదండ రామాలయం, శ్రీజ్ఞానసరస్వతీదేవి ఆలయాలతో పాటు మహిళలు ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలు ఆచరించి లక్ష్మీదేవికి పూజలు చేశారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు గడువు పెంపు

కల్లూరు: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి సెప్టెంబర్ 5వ తేదీ వరకు గడువు పెంచినట్లు మధిర స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 20వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 30 వరకు గడువు కలదని, ఇంటర్, పాలిటెక్నిక్, డిప్లమా, ఐటీఐ పాస్ అయిన వారు సంబంధిత సర్టిఫికెట్లతో దగ్గరలోని మీ సేవ, టీఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర (094), సెల్ నం. 7382929694 ను సంప్రదించాల్సిందిగా కోరారు.

అండర్‌పాస్ నిర్మించాలి

ముదిగొండ: రైతులు పంట పొలాలకు వెళ్లడానికి ముదిగొండలోని చెరువుకట్టకు దగ్గరలో ఉన్న జాతీయరహదారిపై అండర్‌పాస్ నిర్మించాలని రైతులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఖమ్మంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. అండర్‌పాస్ లేకపోతే రైతులు తమ పంట పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్మినేని సుధాకర్, రైతులు ఉపేందర్‌రావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చింతకాని: వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామసర్పంచ్ పిచ్చయ్య అన్నారు. మండలంలోని పాతర్లపాడులో ఖమ్మం నగరానికి చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మొబైల్ ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, వైద్యులు హరినాద్‌బాబు, నర్సింహారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజర్ జల్లా వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఉచిత వైద్య శిబిరం..

తల్లాడ: మండలంలోని పినపాక పంచాయతీ వెంకటాపురంలో శుక్రవారం ఎస్పీయల్ వరల్డ్ క్లాస్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులు అందించారు. ఈ వైద్య శిబిరంలో కృష్ణయ్య, వైద్యులు బాబు, విద్యాసాగర్, బైరోప్రాక్టర్, సుగుణరావు, సంతోష్, వీరన్న, మస్తాన్‌ఆలీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా లెప్రసీపై అవగాహన



లెప్రసీపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సత్తుపల్లిటౌన్: లెప్రసీని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్ అన్నారు. సత్తుపల్లి పట్టణం, గ్రామాలలో శుక్రవారం ఆరోగ్య, మెప్మా, ఐకేపీ, ఐసీడీఎస్ సిబ్బంది కలిసి ఇంటింటా సర్వే నిర్వహించారు. శరీరంపై మచ్చలను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అన్నమ్మ, ప్రమీలారాణి, నర్సింహారావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వైరా: వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చదువుతున్న ఇద్దరు నిరుపేద విద్యార్థులకు శుక్రవారం లయన్స్ విద్యా ట్రస్ట్ ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, గ్రేట్ విజన్ బాధ్యులు ఉండ్రూ వరలక్ష్మి, ఉండ్రూ శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, కొనకళ్ల విశ్వేశ్వరరావు, ఎనమద్ది శ్రీను, వుయ్యూరు రామకృష్ణ, సూర్యదేవర శ్రీధర్, మద్రికంటి శివ, గోపి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు..

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనబోతుల వీరబాబు ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఏఓ డాక్టర్ కేశగాని రాజశేఖర్‌గౌడ్ అతనికి రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో పాపారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ/సత్తుపల్లిరూరల్: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రాజేష్ తెలిపారు. అదే విధంగా సత్తుపల్లి మండలంలోని గౌరిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం రేజర్ల, గౌరిగూడెం, సిద్దారం ఫీడర్ల పరిధిలో విద్యుత్ సఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు తెలిపారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా.. సర్వాయి పాపన్న జయంతి

మండలంలోని పలు గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ విగ్రహానికి, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, గౌడసంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గౌడ సంఘం జెండాను ఆవిష్కరించారు. మహిళలు, యువకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆనాటి సమాజంలో నిరంకుశ రాజరిక పోకడలకు వ్యతిరేకంగా సబండ వర్గాలను ఏకం చేసి పోరాడిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అన్నారు. - సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు



వైరా: సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బొర్రా రాజశేఖర్, తదితరులు



మధిరలో..



ముదిగొండ: వల్లభిలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



వైరారూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ పావని

మధిర/వైరారూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అదే విధంగా వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వేల్పుల పావని అధ్యక్షన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెవెన్యూ శాఖాధికారులు గైర్హాజరు కావడంతో పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాచాపురం, కోస్తాల, స్టేజీపినపాక సర్పంచులు వేల్పుల జయరాజు, మంచాల జయరాజు, దేవరకొండ పుల్లంరాజులు మాట్లాడుతూ.. జీఓ నంబర్లతో సంబంధం లేకుండా అందరికీ గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తమ నివేదికలను చదువుతుండగా.. కొస్తాల, తాటిపూడి సర్పంచ్‌లు జయరాజు, పెద్దభద్రయ్య కలగజేసుకొని తాటిపూడి రామాలయం సమీపంలో మిషన్ భగీరథ పైపు పగిలినా.. ఆస్పత్రి ఆవరణలో నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మరడంతోపాడు, ఆస్పత్రి భవనం, మరుగుదోడ్లు శిథిలావస్థకు చేరినా.. అధికారులు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇకనైన ఈ సమస్యలను పట్టించుకోవాలన్నారు. సాగర్‌జలాలు విడుదల చేయకపోవడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలపడంతో.. అధికారులు జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్. లాల్ మహ్మద్, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ఎంపీడీఓలు షిలార్‌సాహెబ్, డి.కరుణాకర్‌రెడ్డి, సూపరిడెంటెండ్ రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



బోనకల్: గేదెకు టీకా వేస్తున్న వైద్యాధికారి

మధిర: జంతు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జడ్జి కార్తీక్‌రెడ్డి తెలిపారు. మధిర పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశుఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పశు వైద్యులు అన్వేష్, సిబ్బంది రఫీ, అహ్మద్, లక్ష్మణ్‌రావు, జానిమియా, కొండలరావు, ఉపేందర్, రమేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు..

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో శుక్రవారం మండల పశు వైద్యాధికారి ప్రవీణ్ గాలికుంటు వ్యాధికి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు సీజనల్‌గా వచ్చే ఈ వ్యాధిని తెలుసుకొని టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమ్మినేని బాబు, ఎంపీటీసీ సునీతపాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలి

సత్తుపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ సంక్షేమ బోర్డులో సభ్యత్వ నమోదు రాయితీలు పొందుటకు నూతనంగా ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం తొలగించాలని ఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక శ్రీలక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో సత్తుపల్లి నియోజకవర్గ హౌస్ పెయింటింగ్ వర్కర్స్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు నిత్యం సిమెంట్, మట్టి, పెయింట్ పనులు చేయడం వలన చేతి వేళ్ల అరిగిపోవడంతో బయోమెట్రిక్ తీసుకోవడం లేదన్నారు. దీంతో వారికి అందాల్సిన సంక్షేమ ఫలాలకు దూరం కావాల్సి వస్తుందన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యోబు, నాయకులు శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

తల్లాడ: ఈ నెల 14న మండలంలోని బిల్లుపాడు పాఠశాలలోని హెచ్ఎం, ఉపాధ్యాయులపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం బిల్లుపాడు పాఠశాలను టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు సందర్శించి జరిగిన ఘటనపై వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, శ్రీహరి, రమేష్, అనంతరాములు, వెంకటేశ్, నరసింహారావు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

సత్తుపల్లిరూరల్: సింగరేణి కంపెనీని ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జర్నల్ సెక్రటరీ వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ మహాసభలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మోదీని గద్దె దించేందుకు కార్మికవర్గం చిత్తశుద్ధితో పని చేయాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు అండగా ఉండేందుకు యూనియన్ ఎల్లప్పుడూ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, వీరాస్వామి, మల్లికార్జున్‌రావు, గట్టయ్య, సుధాకర్, నర్సింహారావు, భీమయ్య, భద్రి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి ఇసుక రేవుతో పాటు మరికొన్ని రేవులలో ఎటువంటి అనుమతులు లేకుండా కొంతమంది ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గత వారం రోజులుగా ఇసుక మాఫియా జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ముదిగొండ: ముదిగొండలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. శుక్రవారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్ వరకు ప్రదర్శన నిర్వహిచారు. అనంతరం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ అశోక్‌కుమార్‌కు ఎస్ఎఫ్ ఐ నాయకులు వినతిపత్రం అందించారు. నాయకులు రాజు, వెంకట్, చరణ్, భాను, మనోహర్, మహేష్, వెంకటేష్, గోపి, శ్రావణి, కల్యాణి లు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి



అవగాహన కల్పిస్తున్న డీటీ కరుణాకర్‌రెడ్డి

ఎర్రుపాలెం: బీఎల్ఓలు విధులు సక్రమంగా నిర్వర్తించాలని డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీటీ మండలంలోని 15 మంది అంగన్‌వాడీ టీచర్లకు.. ఎన్నికల పోలింగ్ బూత్ లెవల్ ఆఫీసర్‌లుగా బాధ్యతలను అప్పగించారు. అనంతరం బీఎల్‌వోలకు విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. పనుల ఒత్తిడికి గురౌతున్న తమకు బీఎల్‌వోల పని కూడా ప్రభుత్వం అప్పగిస్తే ఎలా అని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి తమను బీఎల్‌వోల విధులు నుంచి తప్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కె.కృష్ణకుమారి, జి.మాధవి, వై.రాజేశ్వరి, ఎం.మహాలక్ష్మి, నాగమణి, లక్ష్మి, మేఘన, సుభాషిణి, పద్మ తదితరులు ఉన్నారు.

'విజయ'లో శిక్షణా తరగతులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొణిజర్ల: మండలంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ తరగతులను శుక్రవారం టాస్క్ రిసోర్స్ పర్సన్ ఎస్.హేమంత్ కృష్ణ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కంప్యూటర్ రంగంలోని విప్లవాత్మక మార్పులకు క్లౌడ్ టెక్నాలజీ దోహద పడిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సంధ్యారాణి, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

21న ప్రధానోపాధ్యాయుల సమావేశం

కల్లూరు: మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ దామోదర ప్రసాద్ అన్నారు. ఈ సమావేశాన్ని మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు హాజరుకావాలన్నారు. ఈ సమావేశం పాఠశాలల క్రీడల నిర్వాహణకు సంబంధించి ఉంటుందని, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సమయానుకూలంగా హాజరు కావాలని కోరారు.